క్లుప్తంగా

కుమారస్వామికి విశేషపూజలు



శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శ్రీభ్రమరాంబామల్లికార్జునస్వామివార్ల ఆలయ ప్రాంగణంలోని కుమార స్వామి ఉపాలయంలో మంగళవారం ఈఓ ఎస్ లవన్న, అర్చకులు విశేష క్రతువుల ను నిర్వహించారు. కుమారస్వామికి అభిషేకము, సుబ్రహ్మణ్య, అష్టోత్తరము చేసిన అనంతరం స్తోత్రపారాయణాలు చేశారు. స్వామివారికి పంచామృతాలు, వివిధ పండ్ల రసాలతో అభిషేక కార్యక్రమం నిర్వహించారు.

మోడల్ స్కూల్‌లో ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తులు

వెలుగోడు: స్థానిక ఏపీ మోడల్ స్కూల్‌లో ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ నళిని కోరారు. ఈ నెల 22 నుంచి జూలై 7లోపు ఆన్‌లైన్ (https:// apms.apcfss.in, https:// cse.ap.gov.in వెబ్‌సైట్ల) ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. పదో తరగతిలో మెరిట్, రిజర్వేషన్ ప్రకారం ప్రవేశాలుంటాయని పేర్కొన్నారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ గ్రూపుల్లో 40 సీట్ల చొప్పున అందుబాటులో ఉన్నాయన్నారు.

పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్యం



సోమయాజులపల్లెలో వైద్యశిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

మహానంది: పరిసరాల, వ్యక్తిగత పరిశుభ్రతతోనే ఆరోగ్యంగా ఉంటామని నారాయణాపురం పీహెచ్‌సీ వైద్యాధికారి దినేష్ తెలిపారు. బండిఆత్మకూరు మండలం సోమయాజులపల్లెలో మంగళవారం వైద్యశిబిరం నిర్వహించి ఫ్యామిలీ హెల్త్ ఫిజిషియన్ కార్యక్రమం చేపట్టారు. ఈ మేరకు డాక్టర్ దినేష్ మాట్లాడుతూ వర్షాకాలం వస్తుండటంతో సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఇళ్ల పరిసరాల్లో మురుగునీరు నిల్వలు లేకుండా చూసుకోవాలని సూచించారు.

రహదారి భద్రతపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న సెక్యూరిటీ అధికారి సూర్యమోహనరావు

శ్రీశైలంప్రాజెక్ట్: రహదారి భద్రతపై మంగళవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అవగాహన కార్యక్రమం జరిగింది. సమావేశానికి ముఖ్యఅతిథిగా ఏపీ జెన్‌కో సెక్యూరిటీ అధికారి ఎస్.సూర్యమోహనరావు హాజరరై ప్రసంగించారు. విద్యతో పాటు సామాజిక అంశాలలో కూడా విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని సూచించారు. రోడ్డు భద్రత నియమాలను తెలుసుకోవాలని, ట్రాఫిక్ సూచికలను క్షుణ్ణంగా అవగాహన చేసుకోవాలన్నారు. మద్యంసేవించి వాహనం నడపడం, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనం నడపడం వలన తీవ్ర ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని హెచ్చరించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ కె.నిర్మల, అధ్యాపకులు డాక్టర్.ఎం.బుచ్చయ్య, కె.రాజన్న, మహేశ్వరరెడ్డి, బాలు పాల్గొన్నారు.

జగనన్న సురక్షపై మండల స్థాయి సమావేశం

కొత్తపల్లి: రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు మెరుగైన సేవలందించేందుకు ప్రవేశపెడుతున్న జగనన్న సురక్ష కార్యక్రమంపై ఎంపీడీఓ మేరి కార్యాలయంలోని సమావేశ భవనంలో మంగళవారం మండల స్థాయి అధికారుల సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ అధికారులు వారి సంబంధిత సచివాలయాల్లోని గ్రామవలంటీర్లతో వారికి కేటాయించిన కుటుంబాలలో ఏఏ సేవలు పెండింగ్‌లో ఉన్నాయన్న సమాచారం సేకరించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ శ్రీనివాసనాయుడు, డిప్యూటీ తహసీల్దార్ మనోహర్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ జహంగీర్ బాషా తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి వలంటీర్లకు శిక్షణ

మహానంది: జగనన్న సురక్ష పథకంపై రేపటి నుంచి వలంటీర్లకు శిక్షణా కార్యక్రమం ఉంటుందని ఎంఎల్ఓ కుమార్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ 21న బొల్లవరం, తమ్మడపల్లె, బుక్కాపురం, 22న అబ్బీపురం, తిమ్మాపురం, మహానంది, 23న గాజులపల్లె, గోపవరం, 24న సీతారామాపురం, మసీదుపురం గ్రామాల్లో వలంటీర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తామని వివరించారు. వలంటీర్లు అందరూ తప్పకుండా హాజరు కావాలని ఆయన కోరారు.

విద్యా కానుక.. భవ్య వీచిక

- ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు జగనన్న విద్యా కానుక
- 45,630 మందికి ప్రయోజనం
- జగన్‌మామయ్యకు కృతజ్ఞతలు తెలుపుతున్న విద్యార్థులు



వీపనగండ్ల జెడ్పీహైస్కూల్‌లో విద్యార్థినికి జగనన్న విద్యా కానుక అందజేస్తున్న దృశ్యం

నందికొట్కూరు: నియోజకవర్గంలో జగనన్న విద్యా కానుక పంపిణీ కార్యక్రమాలు వేడుకలా జరిగాయి. ప్రభుత్వ పాఠశాల్లో ప్రతి రోజూ పండగ వాతావరణమే. చదువు ఒక్కటే తలరాతను మార్చగలదని బలంగా నమ్మిన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాఠశాలలను చరిత్రలో ఎన్నడూ లేని విధంగా అత్యాధునిక వసతులతో తీర్చిదిద్దారు. అంతే కాకుండా పేద విద్యార్థుల చదువులకు ఏ విధంగా ఆటంకం కలుగకూడదనే ఉద్దేశంతో జగనన్న విద్యాకానుక కిట్లను పాఠశాలలు తెరిచిన రోజే అందజేశారు. దీంతో విద్యార్థులు థ్యాంక్యూ జగన్ మామయ్య అంటూ కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

పెరుగుతున్న అడ్మిషన్లు

నియోజకవర్గంలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, గురుకుల తదితర అన్ని ప్రభుత్వ పాఠశాలలు 263 ఉండగా అందులో ఇప్పటి వరకు సుమారు 45,630 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. ఇంకా పాఠశాలల్లో చేరుతున్న వారి సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. కాగా ఇప్పటి వరకు 45,630 మందికి జగనన్న విద్యా కానుక ప్రజా ప్రతినిధులు, అధికారులు పంపిణీ చేశారు. పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, యూనిఫాం, బెల్టు, బ్యాగులు, డిక్షనరీలు, బూట్లు ఉన్నాయి.

నియోజకవర్గంలో పాఠశాలల వివరాలు

గురుకుల పాఠశాలలు	- 2
ఆదర్శ పాఠశాలలు	- 4
కస్తూర్బా విద్యాలయాలు	- 5
జెడ్పీ హైస్కూళ్లు	- 32
ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు	- 2
ప్రాథమికోన్నత పాఠశాలలు	- 31
ప్రాథమిక పాఠశాలలు	- 182
ఐటీడీఏ స్కూళ్లు (గిరిజన సంక్షేమ పాఠశాలలు)	- 5
మొత్త విద్యార్థుల సంఖ్య	- 45,630
పంపిణీచేసిన విద్యాకానుక కిట్లు	- 45,630

ఆనందంగా ఉంది



ఒకటో తరగతి నుంచి గవర్నమెంట్ స్కూల్‌లో చదువుతున్నాను. ఎంతో ఖర్చుతో నాణ్యమైన బ్యాగు, మూడు జతల యూనిఫాం, పుస్తకాలతో పాటు 9 రకాల వస్తువులు ఇవ్వడం ఆనందంగా ఉంది. గతంలో కొనుకోవడం చాలా కష్టంగా ఉండేది. సీఎం జగన్ మామయ్యకు కృతజ్ఞతలు.

– భాశ్వంత్ యాదవ్, 10 తరగతి, మిడుతూరు

ఎంతో ప్రయోజనం



నాన్న నా చిన్న తనంలోనే చనిపోయాడు. అమ్మ వ్యవసాయ కూలీ పని చేసేంది. ప్రైవేట్ స్కూళ్లలో చదివించే స్తోమత లేదు. ఒకటో తరగతి నుంచి గవర్నమెంట్ హైస్కూల్‌లో చదువుకుంటున్నాను. ఈ నాలుగేళ్లలో మా పాఠశాలలో జగనన్న గోరు ముద్ద ద్వారా మంచి భోజనం పెడుతున్నారు. అలాగే విద్యాకానుకగా పుస్తకాలు,యూనిఫాం ఉచితంగా అందిస్తున్నారు. జగన్ మామయ్యకు రుణపడి ఉంటాం.

– యశ్వంత్‌రాజు, 5వ తరతగతి వీరాపురం గ్రామం, కొత్తపల్లి మండలం

పొంగిపొర్లిన జోవంక వాగు

- రాకపోకలకు తీవ్ర అంతరాయం
- అంధకారంలో వేంపెంట



జోవంక వాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో నిలిచిపోయిన ప్రయాణికులు

పాములపాడు: మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. వేంపెంట- వెలుగోడు మండల కేంద్రాని మధ్య ఉన్న జోవంక వాగు పొంగిపొర్లింది. రోడ్డుపై వర్షపునీరు ప్రవహించడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. వెలుగోడుకి వెళ్లిన వేంపేట గ్రామస్తులు గ్రామానికి చేరుకోలేక వాగువద్దే వేచి ఉండాల్సిన దుస్థితి ఏర్పడింది. అలాగే వేంపేట గ్రామంలో ఎస్సీ కాలనీ సమీపంలో ప్రధాన రహదారిపై రెండు విద్యుత్ స్తంభాలు గాలి ధాటికి నెలకొరిగాయి. దీంతో కాలనీలో విద్యుత్ అంతరాయం ఏర్పడింది. కిందికి వరగడంతో విద్యుత్ తీగలు ప్రమాదకరంగా మారాయి. అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

వెలుగోడు జోరుగా వర్షం

వెలుగోడు: మండలంలో మంగళవారం సాయంత్రం జోరుగా వర్షం కురిసింది. ఇన్ని రోజులు ఎండ తీవ్రత, ఉక్కపోతతో అల్లాడిపోయిన జనానికి ఈ వర్షం ఉపశమనం కలిగించింది. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురవడంతో ఇళ్ల ముందు నీరు ప్రవహించింది. సాగుకు అనుకూలంగా ఈ వర్షం కురవడంతో రేపటి నుంచి పొలం పనులు కూడా ప్రారంభం కానున్నాయని రైతులు పేర్కొంటున్నారు.

విద్యార్థులకు అవార్డుల ప్రదానం



విద్యార్థికి పురస్కారం అందజేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ ఆసియా మారిఫ్



ఆణిముత్యం బహుమతిని అందుకున్న భువనేశ్వరిని అభినందిస్తున్న అధ్యాపకులు

ఆత్మకూరు: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ చైర్ పర్సన్ ఆసియా మారిఫ్ ఘనంగా సన్మానించారు. ఆమె మాట్లాడుతూ పదవ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను అభినందించడం గర్వంగా ఉందని, ఇంకా విద్యార్థులు కష్టపడి మంచి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం నాగేశ్వరరావు, కౌన్సిలర్ రంగస్వామి, విద్యార్థులు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

శ్రీశైలంప్రాజెక్ట్: ఇంటర్మీడియెట్‌లో అత్యధిక మార్కులు సాధించి జగనన్న ఆణిముత్యం అవార్డును అందుకున్న స్థానిక కళాశాల విద్యార్థిని భువనేశ్వరిని, ఎంపీసీ గ్రూపులో 957 మార్కులు సాధించిన హిమజను మంగళవారం కళాశాల అధ్యాపకులు అభినందించారు. 2023 విద్యా సంవత్సరంలో బైపీసీ గ్రూపులో 952 మార్కులు సాధించి నియోజకవర్గ స్థాయిలో ద్వితీయ స్థానంలో ఆణిముత్యం అవార్డుకు ఎంపికైన భువనేశ్వరి ఏపీ ఎంసెట్‌లో 5,565వ ర్యాంకును కూడా సాధించింది.

సేవలే గుర్తుంటాయి



ఆర్ఐ సుప్రియను సన్మానించిన డీటీ, రెవెన్యూ సిబ్బంది

మహానంది: ప్రభుత్వ ఉద్యోగులు విధి నిర్వహణలో ప్రజలకు చేసిన సేవలే కలకాలం గుర్తుంటాయని బండిఆత్మకూరు ఇన్‌చార్జ్ తహసీల్దార్ హరిత తెలిపారు. బండిఆత్మకూరు ఆర్ఐగా పనిచేస్తూ జూపాడుబంగ్లాకు బదిలీ అయిన ఆర్ఐ సుప్రియను మంగళవారం రెవెన్యూ ఉద్యోగులు సన్మానించారు. కార్యక్రమంలో రీ సర్వే విభాగం డీటీ సౌజన్య, మండల సర్వేయర్ కరీముల్లా, వీఆర్ఓలు మౌలాలి, నాగేశ్వరరావు, ఏసుపాదం, అబ్దుల్‌కలాం, అశోక్, రామకృష్ణ పాల్గొన్నారు.

ఎలుగుబంటి సంచారం



హఠకేశ్వరం వద్ద రోడ్డు దాటుతున్న ఎలుగుబంటి

శ్రీశైలం: క్షేత్ర పరిధిలోని హఠకేశ్వరం వద్ద మంగళవారం సాయంత్రం సుమారు 6గంటలకు ఎలుగుబంటి రోడ్డు దాటుతుండగా వాహన దారులు, సమీప దుకాణాల వారు, భక్తులు, వాహనదారులు చూశారు. వాహనాలు నిలిపి సెల్‌ఫోన్లలో ఎలుగుబంటి రోడ్డు దాటడాన్ని వీడియోలు, ఫొటోలు తీసుకున్నారు. ఈ మధ్య కాలంలో అటవీ ప్రాంతంలో ఉండే చిరుతలు, పెద్దపులులు, ఎలుగుబంట్లు, శ్రీశైలం విస్తరించడంతో అటవీ ప్రాంతం తరిగిపోతున్నందువల్ల జంతువులు జనవాసాల్లోకి వస్తున్నాయి.


రైతులకు పంటనష్ట పరిహారం



రైతులకు పరిహార చెక్కులు అందజేస్తున్న అటవీ శాఖ ఉద్యోగులు

ఆత్మకూరు: వివిధ గ్రామాల్లో అడవి పందుల దాడుల్లో పంటలు నష్టపోయిన రైతులకు మంగళవారం పట్టణంలోని అటవీ శాఖ కార్యాలయంలో నష్టపరిహార చెక్కులను అందజేశారు. ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ మల్లేష్, జనార్దన్ మాట్లాడుతూ అడవి పందుల దాడుల్లో పంటలు నష్టపోయిన ముస్టపల్లి, శ్రీపతిరావు పేట, ఇందిరేశ్వరం గ్రామాలకు చెందిన 20మంది రైతులకు రూ.94,200 పంట నష్టపరిహారం అందజేసినట్లు చెప్పారు.

విద్యుత్ సమస్యలు పరిష్కరించండి



మాట్లాడుతున్న జెడ్పీటీసీ సభ్యుడు పర్వత యుగంధర్ రెడ్డి

మిడుతూరు: విద్యుత్ సమస్యలను పరిష్కరించి రైతులకు అండగా ఉండాలని జెడ్పీటీసీ సభ్యుడు పర్వత యుగంధర్‌రెడ్డి సూచించారు. మంగళవారం స్థానిక విద్యుత్ ఉపకేంద్రం వద్ద రైతులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో రైతులు దరఖాస్తులు చేసుకున్న నెల రోజుల లోపు విద్యుత్ కనెక్షన్ మంజూరు చేయడం హర్షదాయకమన్నారు. టీడీపీ హయంలో విద్యుత్ కనెక్షన్లు అందక తీవ్ర ఇబ్బందులు పడ్డారని గుర్తు చేశారు. టీడీపీ పాలనలో పెండింగ్‌లో ఉన్న విద్యుత్ కనెక్షన్లకు .. జగనన్న పాలనలో మోక్షం లభించిందన్నారు. కార్యక్రమంలో ఏఈ క్రాంతికుమార్, ఉపసర్పంచ్ తువ్వా లోకేశ్వరరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంతంపై విస్తృత ప్రచారం



ఆత్మకూరులో ప్రచారం నిర్వహిస్తున్న త్రైత సిద్ధాంత అనుబంధ సంఘాల ప్రచారకులు

ఆత్మకూరు: పట్టణంతో పాటు అమలాపురం గ్రామంలో మంగళవారం త్రైత సిద్ధాంత హిందూ ధర్మప్రచారం కార్యక్రమాన్ని ప్రచార కర్తలు నిర్వహించారు. ఈ సందర్భంగా త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి హిందూ జ్ఞానవేదిక చింతలపల్లె కమిటీ సభ్యులు రామచంద్రుడు, మునిదాసు, పుల్లారెడ్డి, వరలక్ష్మి, సుబ్బలక్ష్మమ్మ మాట్లాడుతూ.. ఆచార్య ప్రబోధానంద యోగీశ్వర్లు రచించిన ఆధ్యాత్మిక గ్రంథాలు గొప్ప శక్తికలవని, ఎందరో కనువిప్పు కలిగించిన యదార్థ చరిత్రకలిగినవనిచెప్పారు. త్రైత సిద్ధాంతంలో భగవద్గీత అంత్యత ప్రధానమైందని వివరించారు. కార్యక్రమంలో ఆ కమిటీ సభ్యులు వెంకటేశ్వర్లు, రమణమ్మ, హేమలత, రాణెమ్మ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల అమలులో వలంటీర్ల పాత్ర కీలకం

- ఎమ్మెల్యే తొగురు ఆర్థర్
- మండ్లెంలో వలంటీర్లకు సన్మానం



అవార్డులు పొందిన వలంటీర్లతో ఎమ్మెల్యే ఆర్థర్, తదితరులు

జూపాడుబంగ్లా: సంక్షేమ పథకాల అమలులో వలంటీర్ల పాత్ర కీలకమైనదని ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ అన్నారు. మంగళవారం మండలంలోని మండ్లెం గ్రామ సచివాలయ ఆవరణలో వలంటీర్లకు సన్మాన సభను సర్పంచ్ కృపమ్మ అధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే ఆర్థర్ మాట్లాడుతూ ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన వారందరికీ ఇంటింటికీ అందజేస్తున్న ఘనత వలంటీర్లదేనన్నారు. ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాల్లో ఎలాంటి పరపతి లేకుండా, పైసా ఖర్చులేకుండా ఇంటివద్దకే వలంటీర్లు వచ్చి, అర్హులైన వారిని గుర్తించి, వారి వివరాలు ఆన్‌లైన్ చేసి సంక్షేమ పథకాలు అందేలా చేయడంలో కీలకపాత్ర పోషిస్తున్నారని కొనియాడారు. వలంటీర్లు చేస్తున్న కృషిని ప్రశంసిస్తూ ఏటా వారి విధినిర్వహణలో అంకితభావాన్ని గుర్తించి వలంటీర్లకు సేవావజ్ర, సేవారత్న, సేవామిత్ర అనే అవార్డులతో పాటు రూ.30వేలు, రూ.20వేలు, రూ.10వేల నగదు బహుమతులను అందజేస్తున్నట్లు తెలిపారు. మండ్లెం గ్రామంలో సచివాలయం 1, 2, తర్తూరు సచివాలయం పరిధిలో 32 వలంటీర్లు ఉండగా వారిలో ఇద్దరికి సేవావజ్ర, 30 మందికి సేవామిత్ర అవార్డులు మంజూరైనట్లు తెలిపారు. అనంతరం వలంటీర్లకు శాలువ, మెడల్, సర్టిఫికెట్లతో సన్మానించారు. కార్యక్రమంలో తహసీల్దార్ పుల్లయ్య, ఎంపీడీఓ సుబ్రహ్మణ్యశర్మ, పంచాయతీ కార్యదర్శి శరత్‌కుమార్, వైఎస్సార్‌సీపీ నాయకులు గుండ్రెడ్డి భాస్కరరెడ్డి, సర్పంచ్ కృపమ్మ, తూడిచెర్ల సర్పంచ్ బాలమద్దిలేటి, దేవసహాయం, శివానందరెడ్డి, కరుణాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ లెక్చరర్లను రెగ్యులర్ చేయాలి

ఆత్మకూరు: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విధులు నిర్వహిస్తున్న లెక్చరర్లను రెగ్యులర్ చేయాలని కోరుతూ నల్లకాల్వలోని వైఎస్సార్ స్మృతివనంలో మంగళవారం వైఎస్సార్ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు. నంద్యాల జిల్లా ఆర్‌జేడీ కాంట్రాక్ట్ లెక్చరర్ల సంఘం చైర్మన్ బాషా, భాగ్యమ్మలు మాట్లాడుతూ 2014 జూన్ 2వ తేదీ నాటికి పని చేస్తున్న కాంట్రాక్ట్ లెక్చరర్లందరినీ రెగ్యులర్ చేయాలని కోరారు. 14 సంవత్సరాలు అనుభవం ఉన్న 1532మంది లెక్చరర్లు రెగ్యులర్ చేయకపోతే వీధుల్లో పడే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో కాంట్రాక్ట్ లెక్చరర్లు మద్దిలేటి, సుధాకర్, రవి, రంగనాయకులు తదితరులు పాల్గొన్నారు.

పదిమంది పేకాటరాయళ్ల అరెస్ట్

మహానంది: పేకాట ఆడుతుండటంతో పాటు నాటుసారా విక్రయిస్తున్న పది మందిని అరెస్ట్ చేసి నగదు, సారా స్వాధీనం చేసుకున్నట్లు మహానంది ఎస్ఐ జి.నాగేంద్రప్రసాద్ తెలిపారు. తమ్మడపల్లె చెరువు సమీపంలోని గంగమ్మ గుడి వద్ద రుద్రవరం, శిరివెళ్ల, బండిఆత్మకూరు మండలాలకు చెందిన పది మంది పేకాట ఆడటంతో పాటు అటుగా వెళ్లే వారికి సారా విక్రయిస్తున్నారని నంద్యాల జిల్లా స్పెషల్‌పార్టీ పోలీసులు సమాచారం అందించారు. దీంతో ఎస్ఐ, సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని రామ్మోహన్, రహమాన్, వెంకటరమణతో పాటు మరో ఏడుగురిని అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.10,970 నగదు, సెల్‌ఫోన్లు, 47లీటర్ల సారా, కారు, ఆటో, మూడు మోటార్ సైకిళ్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. దీంతో పాటు ఆన్‌లైన్‌లో బెట్టింగ్ నిర్వహించినట్లు సమాచారం ఉండటంతో ఆ దిశగా విచారణ చేస్తున్నారు.

నేడు అంతర్జాతీయ యోగా దినోత్సవం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం ఆధ్వర్యంలో బుధవారం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రత్యేకంగా యోగా కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. స్థానిక చంద్రవతి కల్యాణమండపంలో ఉదయం 7 నుంచి 8.30గంటల వరకు ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. కార్యక్రమంలో ఒంగోలుకు చెందిన ప్రసిద్ధ యోగాచార్యులు బాలసుబ్రహ్మణ్యం యోగాపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించి, యోగా శిక్షణ ఇవ్వనున్నారు. స్థానికులు, యాత్రికులందరు ఈ కార్యక్రమంలో పాల్గొనాలని దేవస్థాన అధికారులు కోరారు.

ఉపాధ్యాయులకు సన్మానం

ఆత్మకూరు: సమాజంలో ఉపాధ్యాయులకు మంచి గుర్తింపు ఉంటుందని ఎంఈఓ జానకీరాం, సురేష్, హెచ్ఎం జాకీర్‌లు అన్నారు. మండలంలోని అమలాపురం ప్రాథమిక పాఠశాల నుంచి బదిలీ అయిన ఉపాధ్యాయులకు మంగళవారం సన్మానకార్యక్రమం నిర్వహించారు. ఉపాధ్యాయులు రుక్మిణి, అబ్బాస్, మహేశ్వరిలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు బాషా, విజయకుమార్, తిరుపతయ్య, స్వామన్న, రియాజ్, వెంకటేష్, దాస్, విద్యా కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

మీ ఆశీర్వాదాలు జగనన్నకుండాలి


- ఎమ్మెల్యే తొగురు ఆర్థర్
- చంద్రబాబునాయుడును నమ్మే పరిస్థితుల్లో రాష్ట్ర ప్రజలు లేరు
- మండ్లెంలో కొనసాగిన 'గడప గడపకు మన ప్రభుత్వం'



వృద్ధురాలికి సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే తొగురు ఆర్థర్

జూపాడుబంగ్లా: ఎన్ని ఆర్థిక ఇబ్బందులెదురైనా ప్రజాసంక్షేమం కోసం అహర్నిశలు కృషిచేస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజల ఆశీర్వాదాలుండాలని ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ కోరారు. మంగళవారం మండలంలోని మండ్లెం గ్రామ సచివాలయం-1 పరిధిలో రెండోవరోజు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని ఇంటింటికి వెళ్లి వారికి నాలుగేళ్ల కాలంలో ప్రభుత్వం మంజూరు చేసిన సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. ప్రజా సమస్యలు తెలుసుకున్నారు. అలాగే మీ ఆశీర్వాదాలు జగన్‌మోహన్‌రెడ్డికి ఉండాలని కోరారు. ఆయన మాట్లాడుతూ కరోనా లాంటి విపత్కర పరిస్థితులు నెలకొన్నా రాష్ట్రంలో పెద్దగా ప్రాణాపాయం సంభవించకుండా ముఖ్యమంత్రి ఇంటింటికి రూ.2వేల నగదు, ఉచితబియ్యం, కందిబేడలు అందజేసి ఆదుకొన్న దయార్థహృదయుడని కొనియాడారు. ఎంత ఆర్థికలేమి పరిస్థితులు నెలకొన్నా ఇచ్చిన మాట ప్రకారం సంక్షేమ పథకాలను నిర్విరామంగా కొనసాగిస్తూ ప్రజలను, డ్వాక్రా పొదుపు మహిళలను,రైతులను, కార్మికులను ఆదుకొన్న ఘనుడు జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. గ్రామస్తులు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తేగా వాటిని సత్వరమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో సర్పంచ్ కృపమ్మ, తహసీల్దార్ పుల్లయ్యయాదవ్, ఎంపీడీఓ సుబ్రమణ్యశర్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు గుండ్రెడ్డి భాస్కర్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, శివానందరెడ్డి,దేవసహాయం, ఉస్మాన్‌బాషా, తూడిచెర్ల సర్పంచ్ బాలమద్దిలేటి, ఎస్సీ,ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యుడు దిలీప్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు



మిడుతూరులోని దుకాణంలో విత్తన ప్యాకెట్లను పరిశీలిస్తున్న టాస్క్ ఫోర్స్ బృందం సభ్యులు

మిడుతూరు: నకిలీ విత్తనాలు, పురుగు మందులు అమ్మితే చట్టరిత్యా కఠినచర్యలు తప్పవని టాస్క్ ఫోర్స్ బృందం తహసీల్దార్ ప్రకాష్ బాబు, వ్యవసాయ అధికారి పీరునాయక్, ఎస్ఐ మారుతిశంకర్ హెచ్చరించారు. మంగళవారం మండలకేంద్రమైన మిడుతూరులో కిసాన్ అగ్రిమాల్‌ను టాస్క్‌ఫోర్స్ బృందం సభ్యులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కిసాన్ అగ్రిమాల్‌లో తనిఖీ చేశారు. కిసాన్ మాల్‌లో పత్తి, మొక్కజొన్న విత్తనాలను సంబంధించి సరైన స్టాక్ రిజిష్టర్ నమోదు, బిల్లు రసీదులు లేకపోవడం, ధరల పట్టిక, ఇన్‌వాయిస్‌లు లేని కారణంతో రూ. 4, 94, 492 విలువైన విత్తనాలు నిలిపివేసినట్లు తెలిపారు. 15 రోజుల లోపు విత్తనాలకు సంబంధించిన స్టాక్ రిజిష్టర్, ధరల పట్టిక తదితర వాటిని నిబంధనల మేరకు రుజువుచేసుకుంటే అమ్ముకోవడానికి అనుమతులు ఇస్తామని తెలిపారు.

జూపాడుబంగ్లా: మండలంలోని పారుమంచాల, తూడిచెర్ల గ్రామాల్లోని విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల దుకాణాలను ఏఓ కృష్ణారెడ్డి తనిఖీ చేశారు. దుకాణాల్లోని ఎరువులు, పురుగుమందుల తేదీలను పరిశీలించి స్టాకు రికార్డులను పరిశీలించారు.

నకిలీ విత్తనాలు, ఎరువులు విక్రయిస్తే కేసులు

నందికొట్కూరు: నకిలీ విత్తనాలు, ఎరువులు విక్రయిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేయడం ఖాయమని మండల వ్యవసాయ అధికారి షేక్ షేక్షావలి హెచ్చరించారు. మంగళవారం పట్టణంలోని మనో గ్రోమోర్‌లో ఆకస్మిక తనిఖీ చేశారు. రికార్డులను, స్టాక్‌ను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రైతులు కొనుగోలు చేసిన విత్తనాలకు, ఎరువులకు దుకాణదారులు తప్పని సరిగా రసీదులు ఇవ్వాలని సూచించారు.

అలరించిన భక్తిరంజని



భక్తిగీతాలను ఆలపిస్తున్న కళాకారులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా రాజమహేంద్రవరంకు చెందిన ఎం.మారుతి, బృందం వారు భక్తిరంజని కార్యక్రమాన్ని నిర్వహించారు. మంగళవారం ఆలయ దక్షిణమాఢవీధిలోని నిత్యకళావేదికపై నిర్వహించిన భక్తిరంజని కార్యక్రమంలో హర హర శంకరా, కైలాసవాసా, శివాయ అనవా, కైలాసగిరి నివాసా, గంగాతరంగా, శ్రీశైలవాసా, దయగనవయ్య, శ్రీశైలవాసా తదితర గీతాలను ఆలపించారు. కళాకారులు బాలపెద్దన్న, మారుతి, రంగనాయకులు, శివయ్య, నాగరాజు, ఈశ్వరయ్య, లక్ష్మీనరసమ్మ, చెన్నమ్మ, వెంకటమ్మ, ఎం.లక్ష్మీదేవి, అనసూయ, లక్ష్మీదేవి, కాంతమ్మ తదితరులు గీతాలను ఆలపించారు.